క్లుప్తంగా

నేడు సింగరేణిలో ఉచిత వైద్య శిబిరం

సైదాబాద్: ఉరుకుల పరుగుల జీవన విధానంలో ఆరోగ్య సంరక్షణకు తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలని దళిత మహిళా సమాజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూరేపల్లి సుజాత పేర్కొన్నారు. గురువారం ఐఎస్‌సదన్‌లో ఆమె మాట్లాడుతూ... శుక్రవారం సింగరేణికాలనీలోని గవర్నమెంట్ క్వార్టర్స్ కమ్యూనిటీ హాల్ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. దళిత మహిళా సంఘం, రోటరీ క్లబ్ సికింద్రాబాద్ ఐకాన్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనేవారు రూ. 5 వేల విలువ చేసే అన్నిరకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చని వివరించారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యం అనే సూక్తిని అనుసరించి అందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు పావని, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

కోడి పందేల్లో పాల్గొన్న ముగ్గురి అరెస్టు

హయత్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేల్లో పాల్గొన్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. హయత్‌నగర్ పోలీసుల సమాచారం మేరకు... పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పసుమాముల మంజునాథ కాలనీలో కోడి పందేలు ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. పందేలు ఆడుతున్న బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన సల్మాన్, గోపి, చలపతిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు పందెం కోళ్లు, నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

చుట్టాలబ్బాయే చోరీ చేశాడు..

24 గంటల్లో నిందితుడిని పట్టుకున్న పోలీసులు


నిందితుడు అజహర్

చంచల్‌గూడ: ముందస్తు ప్రణాళికతో తాళం వేసి ఉన్న బంధువుల ఇంట్లో బంగారు ఆభరణాలు, ఐ ఫోన్లు చోరీ చేశాడు ఓ యువకుడు. చోరీ జరిగిన 24 గంటల్లో పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. మాదన్నపేట అదనపు ఇన్‌స్పెక్టర్ అర్జప్ప సమాచారం మేరకు... బాధితుడు ఫిరోజ్ అలీకి వృత్తి రీత్యా ప్లంబర్‌గా పనిచేసే మహ్మద్ అజహర్ అలియాస్ అజ్జు(23) సమీప బంధువు. గత మంగళవారం పథకం ప్రకారం అజహర్ బాధితుడి ఇంటికి వెళ్లాడు. ఇంటికి తాళం ఉండటంతో తాళాలు పగులగొట్టి ఇల్లు మొత్తం వెతికాడు. ఏమీ దొరక్కపోవడంతో బీరువాలు తెరిచి అందులో ఉన్న 6.6 గ్రాముల బంగారు నెక్లెస్, కమ్మలు, ఉంగరాలు, రెండు ఐ ఫోన్లు దొంగలించాడు. ఈ విషయంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా అజ్జును అరెస్టు చేశారు. నిందితుడి నుంచి బంగారు ఆభరణాలు, ఫోన్లు స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు అదనపు ఇన్‌స్పెక్టర్ అర్జప్ప వివరించారు.

తీర్థయాత్రలకు వెళ్తే.. బంగారం, కారు చోరీ

చైతన్యపురి: ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లగా ఇంట్లోకి జొరబడిన గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోని బంగారం చోరీ చేసి పార్కు చేసిన కారు తీసుకుని ఉడాయించిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పవన్‌పురి కాలనీలో ఉండే వ్యాపారి దినేష్ కన్ని 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబంతో తీర్థయాత్రలకు వెళ్లారు. మొదటి అంతస్థులో ఒక పోర్షన్ అద్దెకు ఇవ్వగా మిగిలిన పోర్షన్‌లో దినేష్ కుటుంబం ఉంటోంది. సోమవారం ఉదయం దినేష్ ఇంటి తాళాలు ఓపెన్ చేసి ఉండటాన్ని గమనించిన పక్కింట్లో ఉండే విజయలక్ష్మి అతనికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో దినేష్ తన మేనల్లుడు చంద్రకాంత్‌కు చెప్పారు. అతను ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొటి ఉన్నాయి. బీరువా తెరిచి ఉంది. ఇంటి ముందు పార్కు చేసిన నిస్సాన్ డస్టర్ కారు కూడా కనిపించలేదు. చంద్రకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఫింగర్ ప్రింట్ నిపుణులను రప్పించి ఆధారాలను సేకరించారు. కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. రెక్కి నిర్వహించి తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేసుకుని చోరీకి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పావురాలతో పరేషాన్!

- వ్యాధులు ప్రబలే ప్రమాదం
- విసర్జనాలతో ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్
- పలు ప్రాంతాల్లో ఆందోళనకర పరిస్థితులు

నగరంలో పావురాల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. పలు ప్రాంతాల్లో వందలు, వేలాదిగా చేరుతున్న పావురాలు పరిసరాలను అపరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యానికి చేటు కల్గిస్తున్నాయి. దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు, మెట్రో పిల్లర్లు ఇలా పలు చోట్ల పావురాలు తిష్టవేస్తూ ప్రజలకు అసౌకర్యాన్ని కల్గిస్తున్నాయి. పావురాల వల్ల ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ సోకుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తుండటంతో తామెక్కడ రోగాల బారిన పడతామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


వనస్థలిపురంలోని గణేశ్ ఆలయం ఎదుట పావురాలు


పావురాల రెట్టతో నెలకొన్న అపరిశుభ్రత

వనస్థలిపురం: వనస్థలిపురంలోని గణేశ్ ఆలయం వద్ద వేలాదిగా చేరిన పావురాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుడికి వచ్చిన భక్తులు పావురాల మీద ప్రేమతో నిత్యం నూకలు, జొన్నలు ఇతరత్రా తృణధాన్యాలను పాకెట్లలో తీసుకొచ్చి దాణాగా వేస్తున్నారు. దీంతో పావురాలు చాలాకాలంగా ఇక్కడే ఉంటున్నాయి.

- ఈ కారణంగా పరిసర ప్రాంతంలోని ఇళ్లు, బాల్కనీలు, పార్కింగ్ చేసిన వాహనాలు పావురాల రెట్టలతో నిండిపోతున్నాయి. బాల్కనీలలో ఆరేసిన దుస్తులపై సైతం పావురాలు రెట్టను వేస్తున్నాయని, తీగలపై, చెట్లపై వాలుతూ దారిన పోతున్నవారి బట్టలపై కూడా రెట్టలు వేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పావురాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు.
- పావురాల రెట్ట నేలపై పడి మట్టితో కలసిపోయి మొక్కలకు ఎరువుగా మారే అవకాశం ఉంది. ఇళ్లపై కప్పులు, కిటికీలలో విసర్జిస్తుండటంతో అది ప్రమాదకరంగా మారుతోంది. పావురాలు విసర్జించిన తర్వాత అది ఎండిపోయి చిన్న కణాలుగా మారి గాలిలో కలసిపోతాయి. ఆ కణాలు శ్వాస ద్వారా ప్రజల ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. పావురాల విసర్జనంలో హిస్టాప్లాస్మా అనే ఫంగస్ ఉంటుందని, దాని వల్ల ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో హైపర్ సెన్సిటివిటీ, నిమోనైటీ, బర్డ్ ఫ్యాన్సియర్స్ లంగ్ అనే ఊపిరితిత్తుల అలర్జీ వస్తుంది. దీని లక్షణాలు నిమోనియాకు దగ్గరగా ఉంటాయి. దానివల్ల జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారు, కోవిడ్ వచ్చి తగ్గినవారు పావురాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కొన్ని నెలల క్రితం సినీ నటి మీనా భర్త మరణించడానికి కూడా పావురాలే కారణమని డాక్టర్లు తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే.

నిషేధం అమలు ఎక్కడ...

2019లో హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని హార్టికల్చర్ పార్కులలో పావురాలకు ఆహారాన్ని వేయడాన్ని నిషేధించింది. పావురాలు ఎక్కువగా ఉండే మొజంజాహి మార్కెట్‌లో వాటికి దాణా వేయకుండా నియంత్రించారు. 2020లో కూడా నగరంలో వీటిని పూర్తిగా నిషేధించాలని ప్రజల నుంచి డిమాండ్ వచ్చినా అది అమలుకు నోచుకోలేదు. అయితే అధికారులే వచ్చి ఏదోఒకటి చేయాలని ఎదురుచూస్తే ప్రాణాలకే ప్రమాదమని, స్వీయ నియంత్రణే మేలని వైద్యులు పేర్కొంటున్నారు.

ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్

పావురాల విసర్జనాలతో వ్యాపించే గాలిని తీసుకోవడంవల్ల ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. ఒకవేళ ఇన్‌ఫెక్షన్ సోకితే అది మందులకు కూడా తగ్గడం కష్టం. పావురాలు ఇళ్ల సమీపంలో తిష్టవేయకుండా, విసర్జించకుండా చూసుకోవాలి. పావురాల పెంట లేకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు నీళ్లతో కడిగి శుభ్రం చేసుకోవాలి. పావురాలకు ఆహారం వేస్తూ వాటికి దగ్గరగా ఉండటం కూడా మంచిది కాదు. – డాక్టర్ కృష్ణ, ఆర్ఎంఓ, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి

చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిత

జైళ్ల శాఖ ఐజీ రాజేశ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ ఐజీ రాజేశ్

హస్తినాపురం: చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే ఎవరికైనా ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని జైళ్ల శాఖ ఐజీ వై.రాజేశ్ అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని స్థానిక ఉత్పత్తుల కేంద్రం ప్రతినిధి భరత్ సంగం ఆధ్వర్యంలో సందేశాత్మకమైన సూక్తులతో కూడిన పోస్టర్‌ను గురువారం ఐజీ రాజేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐజీ రాజేశ్ మాట్లాడుతూ... మార్చి 23న లాహోర్ జైలులో భరతమాత ముద్దుబిడ్డలు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు లాంటి మహోన్నతమైన వ్యక్తులను బ్రిటిష్ సర్కార్ ఉరి తీసిన రోజని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేసిందల్లా భరతమాత ముద్దుబిడ్డలు బాగుపడాలని ప్రజలను చైతన్యపరచడమేనని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం.. భావి భారత పౌరుల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తుల ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి చెడు వ్యసనాలకు దాసోహమైన వారి జీవితం అంధకారంగా మారుతుందని యువతకు సూచించారు. నేరాలు చేయొద్దు గ్రామాలు వీడొద్దు అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు శ్రీమాన్ రెడ్డి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి


జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

వనస్థలిపురం: తమ డివిజన్ల పరిధిలో రోడ్లు ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులను మంజూరు చేయాలని పలువురు బీజేపీ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ... నిధుల కొరత కారణంగా తమ డివిజన్ల పరిధిలో అభివృద్ధి ఆగిపోయిందని ఆయన దృష్టికి తీసుకొచ్చామన్నారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహగుప్తా, గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. తమ వినతిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా కార్పొరేటర్లు వెల్లడించారు.

అధికారులకు సన్మానం

సైదాబాద్: కాలనీల్లో నెలకొంటున్న సమస్యలను ప్రస్తావించగానే స్పందించి పరిష్కరిస్తున్న జీహెచ్ఎంసీ అధికారుల తీరు అభినందనీయమని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ వై.ఎస్.ఆర్.మూర్తి అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీ లక్ష్మీనగర్ కాలనీలోని స్వామివారి ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణానికి సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ వి.నర్సింహా సహా పలువురు అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ వేదపండితులు ఎం.రత్నాజీశర్మ ఈ సంవత్సర గోచార ఫలాలను వివరించారు. చైర్మన్ మూర్తి తాము సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ నర్సింహా, అధికారులు సోమయ్య, యాదయ్యలను శాలలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి సుబ్రమణ్యశాస్త్రి, శేషగిరిరావు, రంగారావు, ప్రసాదరావు, వేదుల కనకదుర్గ పాల్గొన్నారు.


అధికారులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

త్వరలో పెండింగ్ ప్లాట్ల క్రమబద్ధీకరణ

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


కలెక్టర్ హరీష్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పెండింగ్ ప్లాట్లు, ఇండ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీఓ 118 సవరణ ప్రకారం త్వరలో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్‌ను కలసి పెండింగ్ ప్లాట్లు, ఇళ్ల క్రమబద్ధీకరణ, జీఓ 118 సవరణ విషయంపై చర్చించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... ప్లాట్లు, ఇళ్ల క్రమబద్ధీకరణకు క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారులు రాకపోవటంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో వారందరికీ డిమాండ్ నోటీసు వస్తుందన్నారు. ఇప్పటికే డిమాండ్ నోటీసులు అందుకున్నవారు ఈ నెల 31లోపు మీ సేవా కేంద్రాలు లేదా ఆన్‌లైన్‌లో నిర్దేశించిన మెత్తాన్ని చెల్లించాలని కోరారు. దశాబ్దాల తరబడి ప్లాట్లు, ఇళ్ల క్రమబద్ధీకరణకు నిరంతరం శ్రమించి మార్గం సుగమం చేసిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి బాధిత కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను కలసిన వారిలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, నాయకులు కటికరెడ్డి అరవిందరెడ్డి, సత్యంచారి, నల్లా రఘుమారెడ్డి, శ్రీనివాస నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, పోగుల రాంబాబు, పురుషోత్తంరెడ్డి, ముత్యంరెడ్డి, అంజిరెడ్డి, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత భగత్‌సింగ్


భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: దేశ యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తి ప్రదాతగా నిలిచిపోయారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ పేర్కొన్నారు. గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని సైదాబాద్ డివిజన్ రెడ్‌క్రాస్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్య పోరాట అమరవీరులు మనకు ఎప్పటికీ చిరస్మరణీయులన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు గంగిశెట్టి రాజేష్, లింగాల శ్యామ్‌గౌడ్, శ్రీను, చంద్రకుమార్, మహేష్, వెంకటేష్, నవీన్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు రెండు ల్యాప్‌టాప్‌ల వితరణ

మలక్‌పేట: బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి తనయుడు రాఘవరెడ్డి ఓటర్ల నమోదు కోసం రెండు ల్యాప్‌టాప్‌లను విరాళంగా అందజేశారు. సలీంనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి చేతల మీదుగా మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మికి అందజేశారు. అమెరికాలో ఉంటున్న రాఘవరెడ్డి పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పై అభిమానంతో తన వంతు సహాయంగా రూ. 1.60 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు అందజేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బొక్క మధుసూదన్‌రెడ్డి, కొప్పుల దినేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ భాగ్యలక్ష్మికి ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న రమేష్‌రెడ్డి

శ్రీరామనవమి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

చంచల్‌గూడ: శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ రామాలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు శ్రీ సీతారామకల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తామని నిర్వాహకుడు నిరంజన్‌యాదవ్ తెలిపారు. గురువారం రామాలయంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో రోజువారీగా హనుమద్వజారోహణం, మాతాజాగరణ్, అశ్వవాహన సేవ, గరుడవాహన సేవ, ఆంజనేస్వామి సేవ, శ్రీవారి ఊరేగింపు, సీతారాముల హనుమత్ వాహన సేవా ఊరేగింపు, మహా యజ్ఞం కార్యక్రమాలను ఉంటాయని వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, శ్రీనివాస్, ధన్‌రాజ్‌యాదవ్, గోపి, యాట ప్రమోద్, నవీన్, రాజ్‌పాల్‌యాదవ్, రాహుల్ కిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌టెక్ వాహనం కేటాయించాలని వినతి

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికై సైదాబాద్ సెక్షన్‌కు మినీ ఎయిర్‌టెక్ వాహనాన్ని కేటాయించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆమె వాటర్‌వర్క్స్ డివిజన్–2 జీఎం అశోక్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఇటీవల సైదాబాద్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీలు పొంగి పొర్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మినీ ఎయిర్‌టెక్ వాహనం అందుబాటులో ఉంటే ఆయా ప్రాంతాల్లోని సమస్యను అప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలు ఉంటుందని వివరించారు. తమ వినతికి జీఎం సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ తెలిపారు. ఆస్మాన్‌ఘడ్ వాటర్‌వర్క్స్ డీజీఎం షీలారాణి, సైదాబాద్ సెక్షన్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, మలక్‌పేట నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, గోల్డ్ శ్రీనివాస్, గజానంద్, నాగరాజు, సుభాష్ పాల్గొన్నారు.

'లీకేజీ'లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: కాంగ్రెస్

మలక్‌పేట: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు మలక్‌పేట నుంచి కార్యకర్తలతో గురువారం హిమాయత్‌నగర్‌లోని సిట్ కార్యాలయ ముట్టడికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో సబ్బండ వర్గాలు పోరాడి తెచుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ప్రజలకు కన్నీళ్లే మిగిలాయన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నీటి మూటలుగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని ప్రగల్భాలు పలికి నిరుద్యోగ యువతకు మొండి చెయ్యి చూపిందన్నారు. పరీక్షలకు సిద్ధమైన 30 లక్షల మంది నిరుద్యోగులు నడిరోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సరాల సమయాన్ని, కోచింగ్‌కు లక్షలాది రూపాయాలు ఖర్చు చేసి పరీక్షలకు సిద్ధమైన నిరుద్యోగ యువత జీవితాలతో సర్కారు చెలగాటం ఆడుతోందన్నారు. నిరుద్యోగులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ధైర్యంగా నిలబడి ఉద్యోగాలు సాధించుకోవాలన్నారు. తక్షణమే పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

అంధులు అన్ని రంగాల్లో రాణించాలి

ఏఐసీబీ ఢిల్లీ ఫౌండర్ సెక్రటరీ జనరల్ జవహర్‌లాల్‌కౌల్


పింఛన్‌దారులకు చెక్కులను అందజేస్తున్న జవహర్‌లాల్‌కౌల్

వనస్థలిపురం: అంధులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆల్ ఇండియా కాన్ఫడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ (ఏఐసీబీ) ఢిల్లీ ఫౌండర్ సెక్రటరీ జనరల్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ జవహర్‌లాల్ కౌల్ పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్ చింతలకుంట జహంగీర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ (డీడబ్ల్యూఏబీ) తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడచిన ఐదున్నర దశాబ్దాలుగా అంధుల అభ్యున్నతికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. వారికి ఉపకార వేతనాలు, పింఛన్లు అందజేస్తున్నామన్నారు. వర్క్‌షాపులు నిర్వహించుకునేందుకు అంధుల భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏఐసీబీ కార్యదర్శి పొన్నగోటి చొక్కారావు మాట్లాడుతూ... నల్లగొండలో నిర్వహిస్తున్న అంధుల పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, వంద మందికిపైగా వివిధ ఉద్యోగాలలో స్థిరపడ్డారన్నారు. అంధులకు ఇబ్బందికరంగా ఉన్న జీవో 27ను వెంటనే రద్దు చేయాలన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అంధులకు ఒకే భాష ఉండేలా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయాలని కోరారు. అంధుల కోసం అన్ని ప్రత్యేక పాఠశాలలను ఒకే గొడుగు కిందకు సంక్షేమ శాఖ లేదా విద్యా శాఖ కిందకు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు పింఛన్‌దారులకు చెక్కులను పంపిణీ చేశారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, డీడబ్ల్యూఏబీ అధ్యక్షుడు కొల్లు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, దక్షిణామూర్తి, అంజయ్య, స్వప్న, బాబూరావు, సాయిప్రసాద్‌రెడ్డి, బాలేశ్వర్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులో కొనసాగుతున్న సోషల్ ఆడిట్


మలక్‌పేటలోని రేషన్‌షాపులో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు


చాదర్‌ఘాట్: రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు మలక్‌పేట సర్కిల్–1 రేషనింగ్ అధికారులు షాపుల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ప్రతి నెల సర్కిల్ పరిధిలోని 10 శాతం రేషన్ షాపుల్లో ఈ సోషల్ ఆడిట్ నిర్వహించి సరుకుల కోసం వచ్చే కార్డుదారుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తారు. వారి ఫీడ్‌బ్యాక్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ప్రొఫార్మాలో నమోదు చేసి చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌కు పంపిస్తారు. ప్రతి నెల సర్కిల్ పరిధిలోని ఎనిమిది షాపుల్లో వారంలో రెండు చొప్పున షాపులను ఎంపిక చేసుకొని అక్కడ వినియోగదారులతో మాట్లాడి వారి సలహాలు, సూచనలు సేకరిస్తారు. రేషన్ సర్కిల్–1 పరిధిలో మొత్తం 80 రేషన్ షాపులు ఉండగా ఇందులో 60 వేల తెల్ల రేషన్ కార్డుదారులున్నారు. సర్కిల్ పరిధిలోకి వచ్చే అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, మూసారాంబాగ్, చావుని, అజంపురా, సైదాబాద్ డివిజన్‌లలో ప్రతి నెల జరిగే ఈ సోషల్ ఆడిట్‌లో ప్రజాప్రతినిధులతో పాటు బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాల నేతలు పాల్గొంటూ రేషనింగ్ అధికారులకు తాము ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేయడంతో పాటు సూచనలు కూడా ఇస్తారు. రేషన్‌షాపుల్లో పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా చూసేందుకే సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటారు.

ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి శుభాకాంక్షలు



ఎల్‌బీనగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం సాధించిన ఏవీఎన్ రెడ్డిని గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం


కార్యవర్గ సభ్యులు

నాగోలు: క్యాబ్ డ్రైవర్లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలని ఏఐటీయూసీ అనుబంధ సంస్థ తెలంగాణ డ్రైవర్స్,ఓనర్స్ అసోసియేషన్ (టీడీఓఏ) అధ్యక్షుడు దూపం ఆంజనేయులు కోరారు. గురువారం నాగోలు ఏఐటీయూసీ ఆఫీస్‌లో ఏఐటీయూసీ అనుబంధ సంస్థ తెలంగాణ క్యాబ్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ మీటింగ్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథిగా టీడీఓఏ వ్యవస్థాపక అధ్యక్షుడు దూపం ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్యాల ప్రేమ్ చందర్‌రెడ్డి మాట్లడుతూ... డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఇందులో భాగంగా తెలంగాణ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల ప్రేమ్‌చందర్ రెడ్డి, టీడీఓఏ సలహాదారుగా ఈశ్వరయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సామల కరుణాకర్, జాయింట్ సెక్రటరీగా వీరేందర్ నాయక్, రాష్ట్ర ఇంచార్జిగా సుధాకర్, సోషల్ మీడియా కన్వీనర్లు, లీగల్ అడ్వైజర్‌తోపాటు కమిటీ నెంబర్లుగా 16 మందిని ఎంపిక చేసుకున్నారు. అనంతరం అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ... తన సేవలు గుర్తించి మూడోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీఓఏ రాష్ట్ర సలహాదారు మొగిలి ఈశ్వరయ్య, ఇన్‌చార్జిలు సత్యాలు, శివ, పరమేష్, క్యాబ్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

మన్సూరాబాద్: ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హయత్‌నగర్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ... నీటిని పొదుపుగా వాడుకోవాలని, కాలనీలవాసులు తమ ఇళ్ల ఎదుట నీటికి వృథా చేయవద్దని సూచించారు. సంస్థ సీఈఓ నాగ బ్రహ్మచారి మాట్లాడుతూ... హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని డివిజన్ల పరిధిలో పదిరోజుల పాటు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. నీటి సంరక్షణ అవగాహన కార్యక్రమంలో కాలనీవాసులు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీడ్స్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు, కాలనీవాసులు